

# రూపాయల చెట్టు

యవ్వనంలో అడుగుపెట్టి, అందాలు సంతరించుకుని మొగ్గతొడిగినట్లుండి, పూల మొక్కలాగా అందరి కళ్లు తనవేపే తిరిగేట్టున్న కూతురు, రోజూ కొంతసేపు కంటబడకుండా యెటు వుడాయిస్తున్నదని తల్లి ఆరాటపడింది. ఇంటిపనేమో అందుకుంటుంది. యెదురు చెప్పదు. చెప్పించుకోకుండా గ్రహించి పనిచేసిపెడుతుంది.

మేష్టరమ్మ యిల్లు చేరి వాకబ్ చేసింది తల్లి.

''ఇక్కడికి రాలేదమ్మమ్మ గారూ. యేం యిలా దారిబట్టారూ? మేం మీ మతంగాదే? పోనీ నాకు వయసులో వున్న కొడుకూ లేడు, మమ్మల్ని అనుమానించటానికి. ఇంట్లో పని అందుకోటం లేదా అమ్మాయీ?'' అడిగింది అన్నమ్మ అని పిలువబడే ఆనీవిక్టర్ హెడ్‌మిస్ట్రెస్.

తిరిగి వచ్చేస్తూ ఆలోచించింది తల్లి.

ఇది కొనిబెట్టూ, అది కావాలీ అనదు కూతురు. పెట్టినదేదో తలొంచుకు తిని పళ్లెం కడిగి బోర్లించి పరుగుతీస్తుంది. దీనికంటె పెద్దా పిన్నా పెద్ద రగడ చేస్తూ, విసిరికొడుతూ, తిండికానిచ్చి పళ్లేలు దొడ్లోకి విసిరేసి, పుస్తకాల సంచీలందుకుని వెళ్లిపోతారు.

దగ్గర్లోనే కొత్తగా ఓపెన్ చేయబడిన కోచింగ్ సెంటరు బల్ల కంటబడింది. యేమి కోచింగిస్తారని అడిగితే ''కూపీదారుతనం'' అని నవ్వింది ప్రిన్సిపాల్.

''వయఃపరిమితి వున్నదా?'' అనడిగింది తల్లి.

''లేదమ్మా తెలివితేటలు చూసి నాలుగోతరం చూసిన వారి క్కూడా సీటిస్తున్నాము. బ్రెయిన్ చురుగ్గా వుండాలంతే. పెద్ద అంశలేమీ లేవు. చేరుతారా?'' అని నవ్వింది ఫౌండరు.

''హాస్టలు వసతి వున్నదా?''

''వున్నదమ్మగారూ. నా కనుసన్నలలో మెలగాలి. అదే హాస్టల్ ఫీజు. మీ

సమర్ధత చూసి డిప్లొమా యిచ్చి పంపేస్తాం. ఆర్నెల్లే'' మళ్లా నవ్వింది.

ఆర్నెల్లే గదా అని తలూపి ఆనాడే హాస్టల్లో చేరింది తల్లి.

మునుపటి కన్న చురుకై యింటికి వచ్చేప్పటికి యిల్లు బాగానే రన్నవుతున్నది. పిల్లలు కొంత డిసిప్లిన్ నేర్చారు. అన్నీ సద్ది నీటుగా వుంచుతున్నారు. చిన్న సన్నాసులు, చక్కగా ముస్తాబై చెప్పులెక్కించుకుని సంచీలు వీపు మీద వేలాడేసుకుని, గెంతకుండా, నిదానంగా నడుస్తూ బడికెళ్తున్నారు. రోడ్డు రూల్సు గమనిస్తున్నారు.

ట్రయినింగ్ అయింది గదూ మిస్టరీ విడదీయగలిగింది తల్లి. దూరాన్నించే కూతురువెళ్లే దోవా, మలుపులూ కనిబెట్టింది. బ్రెయిన్ పదునెక్కింది గదూ. దూరాన్నించే కూతుర్ని ఫాలో అయింది. లేకపోతే కూతురు వెనక్కు చూసిందంటే టెయిల్ కనబడుతుంది. కూతురు గమ్యం చేరి ఒక రూపాయల చెట్టు వద్ద నిలబడటం కంటబడింది.

రూపాయల చెట్టు నవనవలాడుతూ గుబురుగా గున్నమామిడిలాగా వుండటమేగాక మూడుపువ్వు లారుకాయలనే సామెత లాగా వున్నది. సారవంతమైన నేల మీదున్నది.

కొమ్మలిటూ అటూ గాలికి వూగినై. కూతురు మీద పూలురాలినై. చల్లని నీడలో కూచున్నది కూతురు. దోరపళ్లు రాల్చింది చెట్టు. తిన్ననితిన్ని, కాసిని పమిట కొంగున కట్టి యడమవేపు దోపింది. కూతురు లేచింది. ''ఇవాళ రూపాయలక్కర్లేదా, కోయలేదు?''

''కావాలి. చిన్నవాళ్లున్నారు గదూ యింటిదగ్గర? ఇల్లు చేరగానే మీదబడి చేతులు జాపుతారు.''

''బళ్లలు కొనిబెట్టవా? ఫ్రూటీ తేలేదూ కొంచెం కొంచెం అందరం తాగుతాం?''

''బలపం విరిగిపోయింది. అరిగిపోయింది. రంగు బలపం కొనిబెట్టవా?''

''కొత్త పలక కావాలి. ఇది మూలగా పగిలి వూడిపోయి కన్నంబడింది.

తోటి పిల్లలు నవ్వుతున్నారు'' అలా అడుగుతారు అని తలొంచుకున్నది కూతురు.

ఒక కొమ్మ ఆకుపచ్చగా రబ్బరులాగా వున్నది. తానే వంగి కూతురు చెంపలు రాచింది. కూతురు మితంగా కోసి చిన్న సంచీలో పోసి సంచీ మూసి బొడ్లో దోపుకున్నది. కొమ్మ పైకి వెళ్లిపోయింది.

''మళ్లా వస్తా'' నంటూ, నవ్వులు చిందించి కూతురు యింటిముఖం పట్టింది.

కూతురు తనను గమనించక ముందు, తల్లి దౌడు తీసి, కొంపకొచ్చిపడి, యేమీ యెరగనట్లు యెక్కడికో వెళ్లి అప్పుడే యింటికి వచ్చినట్టు, వంట చేసేవారు లేరు గనక వంటలో మునిగినట్టు నటించసాగింది. ఆమెది కాకి చూపు. ఓ కన్ను వాకిలివేపుంచి కూతురు రాకకోసం చూస్తున్నది.

2

తల్లి కళ్లు మెరమెరలాడినై. మనసు పొంగింది. అందరూ పచ్చపచ్చగా వుండటానికిదా కారణం అనుకున్నది. మనసు వురకలు వేసింది. పన్నగంలాగా జరజరా పాకింది. పాము యెరను అంటే ఆహారాన్ని ఒడిసిపడుతుంది. ఆహారం అందకపోయినా జరజరాపాకుతూనే వుంటుంది.

ఒడుపుగా, నేర్పుగా కూతురు సంచీలాగి రూపాయలు ఒంచి తన కొంగున కట్టుకుని కూతురికి సంచీ రిటర్న్ చేసింది తల్లి.

కొంత సంస్కారం వల్ల, తల్లి మీద గౌరవమూ ప్రేమా వుండటం వల్లా కూతురు మౌనంగా వుండిపోయి రోజులు దొర్లించసాగింది.

''అవసరానికి తీసుకుంటున్నది. నన్ను యేడిపించటానికా?'' అనుకున్నదిగానీ కూతురు '' ఆ రూపాయలేం చేస్తున్నావు?'' అని తల్లిని నిగ్గదీయ లేకపోయింది.

ఒక్కోసారి సంచీ ఖాళీగా వున్నా, లేదా ఆ సంచీలోని రొక్కం చాలకపోయినా,

'' ఇవాళ చెట్టు వేపు వెళ్లలేదా మల్లీ!'' అని అడుగుతుంది. తానే వాడుకుంటున్నదేమోనని అనుమానంగా చూస్తుంది తల్లి.

''వెళ్లాను. కొమ్మ యెక్కువ రాల్చలేదు. కొమ్మనా లేవు. యెవరన్నా రాల్చుకెళ్లారేమో'' అని నవ్వి వెళ్లిపోయింది కూతురు.

మరోసారి తల్లి ఆజ్ఞాపిస్తుంది.

'' ఇవాళ యెక్కువ కోసుకురా మల్లీ!''

''చెట్టునుండద్దూ?'' అని నవ్వి వెళ్లిపోతుంది కూతురు. తల్లి ఫ్రస్ట్రేట్ అయి, యింటి పనీ, వంట పనీ కూతురు నెత్తిన రుద్ది, తిప్పుకుంటూ, తిట్టుకుంటూ గూడెగరేస్తూ వూరికి ఉడాయిస్తుంది. పనిచేస్తూ కూతురనుకుంటుంది.

''అందరూ అదేపనిగా తోడుకెళ్తే బావిలో నీరైపోదూ? నీటివూటలు వెనక్కు పీక్కుపోతై. గొట్టపుబావినించే ఒక్కోసారి నీటిచుక్క రాలదు యెంత సేపు కొట్టినా. మనమే బిందెడు నీళ్లుపోసి కొట్టగా కొట్టగా కాసినిపైకి వస్తాయి. అడుగునా నీరుండాలిగా''.

3

''అయిదొందలు చేబదులు కావాలి రూసీ! ప్రోనోటు వ్రాయమంటావా? వడ్డీ యెంత? అల్లుడొచ్చాడు. కొత్తల్లుడు గదూ. కలవారి బిడ్డ. నాలుగు పదార్థాలూ చేసి పెట్టాలి'' అన్నది పొరుగామె.

''పిల్లామేకా గలదాన్ని. అంతెక్కడుంటుందీ అయిదో పదో అంటే యివ్వగలను గానీ'' అని దీర్ఘం తీసింది రూసీ. పక్క చూపులు చూసింది.

''రూపాయల చెట్టు వేపు వెళ్తుందిగా కూతురూ! తెలియనట్టు'' తమాషాగా నవ్వి తలకాటించింది పొరుగామె. ''ట్రెయినింగైనావుగా. అదెటు వెళ్తున్నదీ కనిబెడితివీ. పచ్చపచ్చగా కనబడుతుంటే అవసరానికాదుకోకపోతారా అని గంపెడాశతో వచ్చాను''.

రూసీ వినబడనట్టు, తలొంచుకుని స్టోర్‌రూమ్‌లోకి దూరింది.

''తమాషాగా వున్నదే పేరు కనకమ్మా! మనవాళ్లు గాదా?'' తోడు వచ్చిన పైడమ్మ అడిగింది.

''మనవాళ్లే. పూర్వసువాసినీ వేషం మనవాళ్లుగాకపోతే అంత బాగా వేయగలరూ? అది నిక్‌నేమ్. రూపాయల చెట్టు సూసింది అని అర్థం'' పొరుగామె కనకమ్మ ద్వారబంధం మీద చేయి ఆన్చి స్టోర్ రూమ్‌లోకి తొంగి చూసింది. గొంతు తగ్గించి అన్నది.

'' ఇది వరకు రెండు చెట్లు రూపాయలు రాల్చేవి వుండేవి. ఒకటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్. రెండవ చెట్టు భిక్కూ అంటే భిషక్. మొదటి చెట్టు రాల్చి రాల్చి యెండి మోడై వానలకు చివికి యెండలకు యెండిపోయింది. కోసే మనిషీ లేదు.

రెండో చెట్టుకు ముళ్లు లేవు. ముళ్ల కంచె అడ్డమూ లేదు. వీరూ వారూ అనే బేధభావం లేక రాల్చేది. రాల్చే వారెక్కువైనారు. కాపూ ఆగిపోయింది. పోషణా లేదు. చిగిర్చినప్పుడు చిల్లరన్నా రాల్చేది. వేళ్లకు పురుగుపట్టి, అడుగున రాయి తాకి యెండిపోయింది. వంట చెరకుగా పనికివచ్చింది.

అదృష్టమంటే రూసీదే. మళ్లా రాల్చే చెట్టు కంటబడింది'' అని నోటిమీద వేలుంచి చూసింది.

''తానే కోసి తెస్తుందే?'' రహస్యంగా అడిగింది పైడమ్మ. తానూ. స్టోర్‌రూమ్‌లోకి చూసింది.

''రూసీ మంచి గడసరి. తనకు ధనకాంక్ష లేదని తానే ప్రచారం చేసుకుంటుంది. ఆ మేకప్ చూసి నమ్ముతారు. బాపూ తన మేకప్‌తోనే దేశీయులనేగాక, విదేశీయులనూ ఆకర్షించారు'' చూపుడు వేలు పైడమ్మ నోటిమీద వుంచి ''వస్తున్నది'' అని కళ్లతో చెప్పింది కనకమ్మ.

రూసీ డబ్బు అందించగానే కొంగున కట్టుకుని ''త్వరగానే తీరుస్తా రూసీ. లెక్క రాసి వుంచు'' అని పైడమ్మ చేయి పట్టుకుని వెళ్లిపోయింది కనకమ్మ.

## 4

కూతురు, అశోకవృక్షం కింద సీతాదేవి ఫోజులో, దొడ్లో బొగడ చెట్టు కింద కూచుని వున్నది.

''ప్రణాళికలూ, ప్రోజెక్టులు మొదలెట్టి యెన్ని రూపాయలు కోసి తెచ్చి అందించినా చాలక, డిమాండు హెచ్చించి ప్రాణాలు తోడేస్తున్నదీ తల్లి. చెట్టు వేపు పోవటం లేదు. పోను అనగానే, దూషణ. తిట్లు అందుకుని, నాన్‌స్టాప్ దండకం చదువుతుంటే వినలేకపోతున్నా. దైవకృపవల్ల, చెట్టు రూపాయలు రాల్చటం వల్ల భుక్తికి సరిపోయే రాబడినిచ్చే జాబ్ వచ్చినా అది గూడా స్వాహా చేస్తున్నది. యేదైనా విరుగుడుందేమో దైవమే చెప్పాలి.''

తల్లి అడుగుల చప్పుడు వినబడగానే గుండె దడ అందుకుంటున్నది కూతురుకి.

'' ఓ రూపాయల చెట్టూ! ఈ సమస్యని నువే సాల్వు చేసుకో. నేనికరాను. రాలేను గూడానూ. కూడూ గూడూ చాలు నాకు'' అని జపిస్తుండగా తల్లి రానే వచ్చింది. కూతురు కళ్లు తెరుపుబడి దయ్యాపు చూపు బడింది.

''స్థలమొకటి చౌకగా అమ్మకానికి వచ్చింది. ఇవాళ వెళ్లేప్పుడు కొంచెం పెద్దసంచీ తీసికెళ్లి, నిండా రూపాయలు కోసుకురా'' అని మంత్రిస్తున్నట్టు చూసింది తల్లి. ''స్థలం కొని యిల్లు కట్టటమైపాయెగా. అందులో వుండు. చెట్టు కాపుకాయటం లేదు. పూతే లేదు. యెవరైనా వచ్చి పూత దులిపి చిమ్మి పోగుజేసి బుట్టలో పోసుకెళ్లారేమో'' అన్నది కూతురు గుండె రాయిచేసుకుని.

''పిలకలు, మొలకలు లేచినట్టున్నాయే'' అని విషపునవ్వు నవ్వింది తల్లి.

''అంటు పెట్టినట్టున్నావే. అది కోసి, విడదీసి ఆ మొక్క తీసుకురా. మన దొడ్లో వేసుకుందాము. అంటు త్వరగా కాపుకొస్తుంది. ఇంక నువ్వు వెళ్లే అవసరముండదు'' అన్నది కటువుగా.

''నువ్వటు వెళ్లి పరిశీలించినట్టు ఋజువైంది. ఆ పనేదో నువ్వే చేస్తే బాగుంటుంది. దైవం మెచ్చుతాడు'' అన్నది కూతురు.

''పోనీ నేనే తెస్తాలే. నీకు గుండె ధైర్యం లేదు'' అని లోపలికి పోయి, దొడ్డికి మరోవేపు పోయి, గునపం, కత్తి, తట్ట పట్టుకొచ్చి చూస్తే కూతురక్కడ లేదు. విసుక్కున్నది. చేతులోవి కిందపడేసింది తల్లి.

‘‘ ఇవేం తెలివితేటలూ? ముద్దు వచ్చినప్పుడే చంకకెక్కవలె. నేనే రాల్చి తెచ్చుకోగలను. అంటు తెచ్చి నాటినా, యీ నేల సారవంతమౌనోగాదో. అదెప్పుడు కాపుకొస్తుందో. యెవరూ రాల్చకుండా కాపలా కాయాలి. అదొక యిబ్బంది. నా కోసమా అడిగానూ? బతికి బట్టకట్టాల్సిన వాళ్లకోసం అడిగితే దులపరించుకు వెళ్లిపోయింది’’ అని గొణిగింది తల్లి.

మనసును కంట్రోల్ చేయలేక వెళ్లింది. పిలకలు వూడి వచ్చాయిగాని వేళ్లూ లేవు. దుంపకోసం తవ్వీ తవ్వీ రెక్కలు పడ్డై. ఆకలి వేళా, భోజనం వేళా. చెమటలు కారుతున్నాయి దాహం. యెండ నడినెత్తి మీద కొచ్చింది. తలెత్తి చూసింది తల్లి. రూపాయల తళతళలు కంటబడలేదుగానీ, మిలమిలమంటూ యేవో మెరుస్తూ కంటబడ్డాయి. కొంకి కఱ్ఱ తెచ్చి కొమ్మలు వంచి, రెమ్మలతో సహా గుత్తులు గుత్తులుగా కోసింది తల్లి. మొగ్గలూ, పిందెలూ, పసరు కాయలూలాంటివేవో వున్నాయి. వంద రూపాయల నోట్లు కొత్తవి యింకా సరిగా విప్పుకోలేదు. ఆరలేదు. కింద చూస్తే యేవో నాణాలు రాలి వున్నాయి. పెద్దకొంగు లాగి నోట్లు పాడుగాకుండా మూటగట్టింది. నాణేలు పోగు చేసి తట్టలో పోసింది తల్లి.

‘‘నేను రావటం మేలే అయింది. త్వరగా భూమి కొనుగోలూ రాత కోతలూ పూర్తి చేయాలి’’ అనుకుంటూ తట్టనెత్తిన బెట్టుకుని, గునపం బుజాన పెట్టుకుని కొంపజేరింది. అన్నీ స్టోర్‌రూమ్‌లో భద్రం చేసి తాళం వేసింది. స్నానం చేసి పిల్లల కన్నాలు పెట్టి తానూ తిన్నది.

5

‘‘అవి దొంగనోట్లు అమ్మగారూ. నకిలీవి. ఇప్పుడు వ్యాప్తిలోకి వస్తున్నాయని పోక్కి రక్షణశాఖవారు అచ్చొత్తించిన వారినీ ముద్రణాయంత్రాన్నీ పట్టాలని రంగంలోకి దిగారప్పుడే. ఇవన్నీ నకిలీ నాణాలు సత్తు, యిత్తడీ కలిపి మింట్ చేశారు. చప్పుడు వల్లా తూకం వల్లా తెలిసిపోతై. ఈ నకిలీనాణాలు తయారుచేసేవారినీ, దొంగనోట్లు వ్యాప్తిలోకి తెస్తున్నవారినీ పట్టిస్తే లేదా వారి

ఆచూకీ చెప్తే మీకు పారితోషకమిస్తారు ప్రభుత్వం. నూరునోటు కాగితం, దాని మందం కొలతలు, ప్రింటింగ్ రంగుకాక, నిశితంగా పరిశీలిస్తే ఆ కాగితం తయారుచేసే కంపెనీ వారి ముద్ర కనబడుతుంది. మందంలో గూడా తేడా వుంటుంది. ఆర్క్ సిల్క్ చీరలు ధర్మవరం పట్టులాగే వుంటాయి చూడటానికి. కాని పోగులు అగ్గిపుల్లగీసి తగలబెడితే కృత్రిమ సిల్క్ పోగులు వూరికే నుశి అవుతాయి లేదా మాయమౌతాయి అదే పట్టుపోగులైతే తగలబడగానే జుట్టుకాలిన వాసన వస్తుంది. అలా తేడా వుంటుంది. ఇవే నంబర్లు గల నోట్లు మా వద్ద వున్నాయి చూస్తారా. ఈ నోటు మెరుపు వేరు'' అని విశదీకరిస్తూ విశాలంగా నవ్వాడు షావుకారు. భూమి అమ్మకం ఆగిపోయినట్టేనని తేలింది. ''చూపిస్తే పారితోషికమిస్తారంటున్నారు. చెట్టు చూపిస్తా'' అన్నది తల్లి.

''చెట్టెందుకు? మనుషుల్ని యంత్రాల్నీ పట్టించాలి'' అన్నాడు షావుకారు అర్థంగాక ''చెట్టే యీ నాణేలూ, నోట్లూ రాల్చింది'' అన్నది తల్లి. షావుకారు సాలోచనగా నిదానంగా చూశాడు.

''మీరు సైకియాట్రిస్టుని సంప్రదించాలి. నేనే తీసుకెళ్లుదుని గానీ, నాకివాళ చాలా బేరమూ పనీ వున్నాయి. ధర్మకాటా చూడాలి. ఇవిగో మీ సంచులు'' అని, నోట్లున్న సంచీ నాణాలున్న సంచీ తల్లి యెదుట వుంచి సన్న చేశాడు షావుకారు. ఇద్దరమ్మాయిలు పోలీస్ యూనిఫామ్‌లో వున్నవారొచ్చి తల్లిని లేవదీశారు. సంచీలతో సహా వాకిట్లోకి నడిపించారు. సమయానికందిన ఆటో ఆపి, అందులో కూచోబెట్టి ఆమె సంచులామె కాళ్లకానించారు.

'' ఇల్లు ఆమే చెప్తుంది. బాడుగా ఆమే యిస్తుంది. మీటర్ చూపి బాడుగ తీసుకో'' అని డ్రైవరుతో చెప్పి వెళ్లారు. ఆటో కదిలిపోయింది.

6

తల్లి కూతురు ఆచూకీ అందక అలాటించింది. కూతురు కోలీగ్స్‌ని పట్టుకున్నది.

'' ఆఫీస్‌కెళ్లి వాకిఫ్ చేయండమ్మగారూ! లేదా ఎఫ్ బి ఐ, సిబిఐ, సిఐడి

వారికి చెప్తే, వారు ష్యూర్‌గా కనుగొని మీకు పతా అందిస్తారు'' అని హాస్యాలాడారు.

అవకాశవాది అయిన తల్లి శ్రమించింది.

''ఏం వుద్యోగం బామ్మగారూ అమ్మాయి చేసేదీ? మీకు టెలిఫోన్ డైరెక్టరీ లేదూ'' అన్నారు సగం హాస్యధోరణిలో.

'స్టెనో కాబోలు. అంటే యేమిటో సరిగా తెలియదు'' అన్నది తల్లి.

''ప్రైవేట్ కంపెనీలోనా? చాలా వున్నాయే'' అని నవ్వు మొహం పెట్టారు.

అక్కడే నిలబడి వింటున్న, చూస్తున్న ఒక వృద్ధునికి తల్లిని చూస్తే జాలేసింది.

''డబ్బు కోసం పీడించేవారేమో మీరు అత్తగారూ. నేననుభవం మీదే అంటున్నా. బాగా గుర్తు చేసుకోండి. ''దొడ్లో రూపాయల చెట్టు పెట్టుకుని, డబ్బు లేదంటావేం?'' అని నిష్ఠూరమాడేవారేమో అత్తగారూ. నా భార్యా రత్నం తల్లిగారంతే. తడిగుడ్డతో గొంతు నులుముతున్నట్టు, చట్రాత నార తీయటం నేర్చి, డబ్బు కంటబడేదాకా గమ్మీ గుమ్మీ'' అని నవ్వసాగాడు, ''ల్యూర్ చేసేది మా అత్తగారు. బహుశా అందుకే అయివుండాలి మీ కూతురు స్టెనో, ఆచూకీ అందని చోట దాక్కున్నది'' అని నవ్వుతూనే వున్నాడు.

7

జరయు మృతియు లేని జనునట్లు ప్రాజ్ఞుండు ధనము విద్య గూర్పవలయు అన్నాడు గొప్ప కవి. జరయు మృతియులేనట్లు ధనము గూర్పవలయు అని నేర్చిన మనిషి తల్లి. ఆ ఐడియాతోనే, తిరిగి తిరిగి కూతురిల్లు పట్టగలిగింది తల్లి.

మంచి యింట్లోనే వున్నారు. ప్రహారీ యెత్తులేదు. ఇంటిచుట్టూ పూలచెట్లు, పండ్ల చెట్లు, కూరపాదులూ ఆకుమడులూ కనిపించాయి. నిమ్మ, నారింజ, సపోటా, కొబ్బరి, అరటి, మామిడి చెట్లు.

గేటు తీసుకుని లోపలికొచ్చింది. రూపాయల చెట్టు పిలకలల్లే పిల్లలు

గంతులేస్తున్నారు. ఆమె వేపు వచ్చారూ. గేటు చప్పుడు విని కూతురూ వచ్చింది.

అంతా లోపలి కెళ్లారు. ఫార్మాలిటీస్ చెల్లిస్తున్నది కూతురు. మెత్తని కుషన్ కుర్చీలో హాయిగా కూచున్న తల్లి, కొంగు విప్పనూ, నోట్లు లెక్క పెట్టనూ సంచీలోంచి, భగవద్గీతా, రామాయణంలోని సుందరకాండా, యోగవాశిష్టం, వేదాంత పంచరీ పుస్తకాలు తీసి పేజీలు తిప్పుతూ చూస్తున్నట్టు నటిస్తూ వాటి మధ్య వున్న నోట్లు కనబడేట్లు వేలు అడ్డంబెడుతూ నోట్లు లెక్కబెడుతూ అన్నది.

''వేరే వుండనేర్చావనుకో మల్లీ! అయినా వచ్చి తోడబుట్టిన వాళ్లనూ నన్నూ చూసిపోతూ వుండాలి''

సహనమంతా ఖర్చయిపోయిన కూతురు నవ్వింది.

''చూసి పోవటమంటే మనీబాగ్‌తో వచ్చి, అంతా ఖర్చు చేసి, పుట్టింటికెళ్లొచ్చానని అందరితో చెప్పుకోటమేగా'' ఫలహారం పళ్లెం కాఫీ బల్ల మీదుంచి దొడ్డి వేపు వెళ్లింది కూతురు.

పిల్లలు గంతులేస్తూ అరుస్తున్నారు. ఇరుగుపొరుగు పిల్లలూ వచ్చారు. కళ్లగంతలాట ఆడుతున్నారు. పొద్దు వాటారుతున్నది. చల్లని గాలీ.

''మల్లా చెట్టు వేసుకున్నదేమో. నేనడుగుతానని భయపడుతున్నట్టున్నది మల్లి. డబ్బు కోసం రాలేదని తెలియాలనే కొంగువిప్పి, పుస్తకాల్లో దాచిన నోట్లు చూపిస్తున్నాను. చూసీ వెళ్లిపోయింది'' అని గొణుక్కుంటూ అన్నీ సర్దేసి కొంగుముడేసి, ఫలహారం పూర్తి చేసి, కాఫీ తాగి లేచింది తల్లి. తానూ పిల్లలాడేవేపు వెళ్లి తిరిగి చూసి, దొడ్డివేపు వెళ్లింది. అక్కడా పిల్లలున్నారు. వారిని పలకరిస్తూ వారిని చూసి సంతోషిస్తున్నట్టు, వారి మధ్యగా నడుస్తూ రూపాయల చెట్టు కోసం వెళ్లింది.

''అమ్మమ్మా! అటుగా వెళ్లకు. ఆ చెట్టు తాకకు. అది ముళ్ల చెట్టు. అంటుకుంటే ముళ్లూ ఆకులూ వదలవు. అన్నివేపులా అంటుకుంటే మరీ కష్టం'' అని ఒక మనమరాలు అరిచింది. వినకుండా వెళ్తున్నది తల్లి. మరో నలుగుర్ని పిలిచి, మనమరాలు పరుగెత్తుకొచ్చి తల్లిని లాగేసింది. అప్పటికే ఆకులూ,

రెమ్మలూ, ముళ్లూ అంటుకున్న తల్లిని. మరో నలుగురు పిల్లలు వచ్చి వాటిని తొలగిస్తున్నారు.

కూతురు వచ్చి చూసింది.

''డబ్బు కోసం రాలేదని నటిస్తూ రూపాయల చెట్టుకోసం వెతుకుతూ వెళ్లినట్టున్నది'' అనుకున్నది.